క్లుప్తంగా

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తెలకపల్లి: ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ డైసినునాలిని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీజీటీ, ఒకేషనల్ గ్రూపులలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లింగాల: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలుర గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ బాలస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, ఎమ్మెల్టీ కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో నిర్ణీత రుసుం చెల్లించి దరకాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పంటల సాగుపై అవగాహన



వెల్దండ: మండలంలోని రాచూర్, అజిలాపూర్, చెర్కూర్, కొట్రా, కుప్పగండ్ల, పోతేపల్లి క్లస్టర్ గ్రామాల్లో మంగళవారం పంటల సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో అధికారులు సమావేశాలు నిర్వహించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల నుంచి రశీదు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు గుత్తి వెంకటయ్య యాదవ్, లక్ష్మమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మమ్మ, ఏఈఓలు హబీబునీస్స, ప్రసన్న, బిన్నతి, అనిత, విజయలక్ష్మి, విజేత, రైతులు తదితరులు ఉన్నారు.

వాల్యువేషన్ తప్పులపై విచారణ జరిపించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్/కొల్లాపూర్: ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యువేషన్ తప్పులపై విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇంటర్ పరీక్షల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్ల కారణంగా విద్యార్థులు నష్టపోయారన్నారు. సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ఊర్కొండ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆర్.రవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విత్తనాలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు. వారి వెంట ఏవో శోభారాణి తదితరులు ఉన్నారు.

మత్స్యశాఖ సంఘాలను అభివృద్ధి చేసుకుందాం

పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలను అభివృద్ధి చేసుకుందామని జిల్లా అధ్యక్షుడు అంజి, మండల అధ్యక్షుడు డబ్బ గోవిందులు అన్నారు. మంగళవారం మంచాలకట్టలో మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్క మత్స్యకారుడు సభ్యత్వం పొందాలన్నారు. రానున్న రోజుల్లో ప్రతి మత్స్యకారుడికి గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. వెంకటనరింహ, కురుమయ్య, నర్సింహ, రాముడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జాబ్‌మేళా ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగులకు జాబ్ మేళా ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల గౌతం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగాలు లేక దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం రోస్టర్ పాయింట్‌లను తగ్గించాలని కోరారు. ప్రైవేటు సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కేసు నమోదు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి శివారులో మంగళవారం జరిగిన భూతగాదాకు సంబంధించిన ఇరువురు వ్యక్తులపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. రైతు రాములుపై శ్రీశైలం, శ్రీనులు దాడి చేసి గాయపర్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బాధితుడు రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పక్కా భవనాలేవి?



పంచాయతీ భవనంలో తహసీల్దార్ కార్యాలయం



వాల్మీకి సంఘం భవనంలో పెంట్లవెల్లి పోలీస్ స్టేషన్

పెంట్లవెల్లి: మండల కేంద్రం ఏర్పడి ఎనిమిదేళ్లవుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నోచుకోలేకపోతున్నాయి. ఇప్పటికి అద్దె భవనాలలోనే అధికారులు కార్యకలాపాలు నిర్వహిస్తు న్నారు. పని నిమిత్తం వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీస వసతులు లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఏళ్లు గడుస్తున్న అధికారులు మారుతున్న అప్పుడు ఇప్పుడు అని కాలయాపన వెళ్లదీస్తున్నారే తప్పా ఇంతవరకు భవానాల నిర్మాణాలకు చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గత పాలకులు ఎన్నోసార్లు హామీలకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

అద్దె భవనంలో పలు కార్యాలయాలు

మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, మహిళా సమైక్య భవనం, వ్యవసాయ కార్యాలయం, సహకారం సంఘ కార్యాలయం, ఎంపీపీ భవనాలు ఇంకా అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. పెంట్లవెల్లిలోని తహసీల్దార్ కార్యాలయం గ్రామ పంచాయతీ భవనంలో, పోలీసుస్టేషన్ వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో, వ్యవసాయ కార్యాలయం వడ్డెర సంఘం కమ్యూనిటీ హాల్, మహిళా సమైక్య భవనంలో కొనసాగుతున్నాయి. అద్దెలు చెల్లించేందుకు ప్రభుత్వంపై అధిక భారం పడుతోంది.

ఎంఈఓ కార్యాలయం మాత్రమే..

ఎనిదేళ్లుగా ఎంఈఓ కార్యాలయం తప్ప ఇంతవరకు ఏ ప్రభుత్వ కార్యాలయ భవనం నిర్మించలేదు. రూ.31 లక్షల వ్యయంతో మండల విద్యా అభివృద్ధి కార్యాలయాన్ని 31–1–2021 నాడు అప్పటి విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రారంభించారు. కాని మిగతా భవనాలు నిర్మించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత భవనాల కొరకు స్థలం కేటాయించి నూతన భవనాలకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్థల పరిశీలన పూర్తి



ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాల నిర్మాణానికి ఇప్పటికే స్థల పరిశీలన పూర్తి అయ్యింది. మండల కేంద్రంలోని పలు సర్వేనెంబర్‌లలో ప్రభుత్వ స్థలాలను పరిశీలించాం. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. సమస్యను మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- హిమబిందు, తహసీల్దార్, పెంట్లవెల్లి

ఇబ్బంది పడుతున్నాం



నూతనంగా మండలం ఏర్పడినప్పుడు పోలీస్ స్టేషన్ కోసం వాల్మీకి భవనాన్ని ఇచ్చాం. కాని ఇప్పటివరకు పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం నిర్మించకపోవడంతో కుల సంఘానికి సంబంధించిన సమావేశాలు నిర్వహించలేకపోతున్నాం. ప్రభుత్వం పక్కా భవనం నిర్మించి మా భవనం మాకు అప్పగించాలి.

- మంతిటి రాజు, పెంట్లవెల్లి

తాగునీటి సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో కొన్ని రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడింది. ఈ నెల 24వ తేది సాక్షి పత్రికలో 'తాగునీటి సమస్య తీర్చండి' అనే శీర్షికతో వార్త ప్రచురితం అయ్యింది. దీనికి పాలకులు, అధికారులు స్పందించారు. గ్రామానికి అధిక మొత్తంలో తాగునీటిని సరఫరా చేసే ఆశ్రమ పాఠశాల వద్ద ఉన్న బోరు మోటారు చెడిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు బోరు మోటారుకు మరమ్మతు తాగునీటి సమస్య పరిష్కరించారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



తాగునీటి బోరును బాగు చేస్తున్న గ్రామస్తులు

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



చారకొండ: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై గీతా కార్మికులు, కిరాణ దుకాణాదారులు, వ్యాపారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సారా వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. కల్వకుర్తి డివిజన్‌లో చారకొండ మండలంలోనే అధికంగా సారా తయారీ, అమ్మకాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సార తయారీ స్థావరాలపై దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజశేఖర్, అబ్కారీ సిబ్బంది తదితరులు ఉన్నారు.


పెద్దకొత్తపల్లి: సారా విక్రయిస్తూ పట్టుబడితే రూ.50 వేల జరిమానాతో పాటు 6 నెలల జైలు శిక్ష ఉంటుందని తహసీల్దార్ ఈసూఫ్‌అలీ అన్నారు. మండల కేంద్రానికి పసుపుల పృథ్వీరాజు 4 లీటర్ల సారా, దేవల్ తిరుమలాపూర్ గ్రామానికి చెందిన బెల్లె ఈశ్వరమ్మ 6 లీటర్ల సారా విక్రయిస్తుండగా ఎక్సైజ్ అధికారులు వారిని పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం సొంతపూచీ కత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ వెంకటమ్మ ఉన్నారు.

ముగిసిన బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ పూజలు



లింగాల: మండలంలోని అవుసలికుంటలో మూడు రోజుల పాటు నిర్వహించిన గ్రామ దేవత బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ పూజలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు మహిళలు బోనాలను ఎత్తుకొని బొడ్రాయి దగ్గర పూజలు నిర్వహించిన అనంతరం కోట మశమ్మ దగ్గర బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులు శక్తి పూజారి బైండ్ల గిరి ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు పలు రకాల శక్తి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని కొత్తచెర్వుతండాలో బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ మల్లేష్‌తో పాటు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వెల్దండ: మండలంలోని బొల్లంపల్లిలో మంగళవారం పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని పోలీసులు వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్‌ఖాతా, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ వివరాలు అడిగి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరికి గాయాలు

తెలకపల్లి: ట్రాక్టర్ బోల్తాపడి ఒకరికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన చిలుక రఘు మండల పరిధిలోని నెల్లికుదురు గుట్ట క్రసర్ నుంచి ట్రాక్టర్‌లో డస్ట్‌ను నింపుకొని మండల కేంద్రానికి వెళ్తున్నాడు. కమ్మరెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద కుక్కలు అడ్డం రావడంతో వాటిని తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే గుంతలో బోల్తా పడి విద్యుత్ స్థంభాన్ని ఢీకొన్నది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రఘుకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

నల్లమలను పర్యాటకంగా తీర్చిదిద్దాలి



అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో ఎన్నో వనరులు ఉన్నాయని, పర్యాటకంగా అభివృద్ధి చేయాలని టీపీసీసీ ఎన్‌ఆర్‌ఐ సెల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని కలిశారు. నల్లమల ప్రాంత పరిస్థితులను వివరించారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



కల్వకుర్తిరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 101వ జయంతి మంగళవారం నిర్వహించారు. పట్టణంలో ఆయన అభిమాన సంఘం నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లింగం, శ్రీశైలం, విజయ్, శ్రీశైలం, మల్లేష్, కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందిస్తాం



కల్వకుర్తి: భారతి సిమెంట్ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నామని భారతి సిమెంట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కొండల్‌రెడ్డి అన్నారు. మంగళవారం భారతి సిమెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌కే స్టీల్ ప్రొఫైల్స్ మొబైల్ కన్‌స్ట్రక్షన్ అడ్వైజర్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడుతూ గృహ వినియోగదారులకు నాణ్యమైన సిమెంట్‌ను అందించడంతోపాటు వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ మార్కెటింగ్ మేనేజర్ సతీష్, టెక్నికల్ మేనేజర్ సునీల్, భారతి సిమెంట్ డీలర్ కరుణాకర్‌రెడ్డి, ఇంజనీర్‌లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు వంశీకృష్ణ



అచ్చంపేట: ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ మచ్చలేని నాయకుడని, ప్రజాదరణ చూసి జీర్ణించుకోలేక ఫోన్ ట్యాపింగ్ చేయించారని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుంద మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్యాపింగ్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రమేయం ఉందని, విచారణ చేపట్టిన ఆయనపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాశన్న యాదవ్, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దాశరథి, పవన్, జబ్బు వెంకటేష్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజ్‌గోపాల్, నర్సింహారెడ్డి, అభి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం



లింగాల: బాలల హక్కులను కాపాడుదామని చైల్డ్‌లైన్ సంస్థ కోఆర్డినేటర్ ప్రమీల కోరారు. మంగళవారం మండలంలోని బాకారంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పనికి పంపించొద్దన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమన్నారు. బాలల హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అధికారులకు వినతి

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డలో 5వ వార్డులోని ప్రధాన సీసీ రోడ్డు వెంట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మట్టి రోడ్డు వేసి ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నాడని మాజీ ఉపసర్పంచ్ బి రామచంద్రారెడ్డి మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం అధికారికి, ఎస్‌ఐకి వినతిపత్రాన్ని అందజేశారు. మట్టిని తొలగించి వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా

పెద్దకొత్తపల్లి: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నాయనోనిపల్లిలో దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్లేని మాట్లాడుతూ దళితులు బీజేపీకి ఓటు వేశారని అక్కసుతో మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు ప్రధాన నిందితులకు వత్తాసు పలుకుతున్నారన్నారు. 16 రోజుల నుంచి విచారణ పేరుతో కాలయాపన చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. పారదర్శకంగా విచారణ చేసి నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొని శిక్షించాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు కోళ్ల శివ మాట్లాడుతూ మంత్రి ఒత్తిడితో పోలీసులు అసలు దోషులను వదిలిపెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. ఘటన స్థలానికి కొల్లాపూర్ సీఐ మహేష్ చేరుకొని ఆందోళనకారులను శాంతింపజేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేసును పూర్తిస్థాయిలో విచారణ చేయలేకపోతున్నామని కొంత సమయం పడుతుందని వివరించారు. కార్యక్రమంలో బీమేశ్వర్‌రెడ్డి, కృష్ణారావు, తిరుమల్, శేఖర్, లింగస్వామి, శివ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తాం



మన్ననూర్: ఆర్యవైశ్య పేద విద్యార్థులకు తోడ్పాడు అందిస్తామని ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు దామోదర్‌శెట్టి తెలిపారు. మంగళవారం ఉమ్మడి అమ్రాబాద్ మండలంలోని పేద ఆర్యవైశ్య కుటుంబాలను కలిశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి ఆర్థికసాయం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు రిటైర్ ఎంఈఓ సుధాకరయ్య, వెంకటరమణ, శ్యాంసుందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పత్తి సాగు



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల రైతులు రెండు రోజుల నుంచి వర్షాల కారణంగా రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నం అయ్యారు. దుక్కులు దున్నుకోవడం, కొంతమంది రైతులు పత్తివిత్తనాలను విత్తుకోవడం అచ్చులు వేసుకోవడం వంటి పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు, పదర మండలాల్లో మోతాదు వర్షం కురవడంతో రాయలగండితాండా, జత్యానాయక్‌తండా, అమ్రాబాద్ మండలంలోని లక్ష్మాపూర్(బీకే), తిర్మలాపూర్ బీకే, కుమ్మరోనిపల్లి, అమ్రాబాద్, ఎమిరెడ్డిపల్లి, ఎల్మపల్లి, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో రైతులు రెండు రోజులుగా పత్తి విత్తనాలు నాటుతున్నారు. రైతులు పొలాల పనుల్లో నిమగ్నమయ్యారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



చారకొండ: మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని డీఆర్‌డీఓ చిన్న ఓబులేష్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో మంగళవారం ఆయన నర్సరీని సందర్శించారు. మొక్కల పెంపకం, వాటి నిర్వహణ, తదితర వాటిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. హరితహారం నాటికి మొక్కలను సిద్ధం చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ కేంద్రాన్ని సందర్శించారు. త్వరగా విద్యార్థులకు యూనిఫాంలను సిద్ధం చేయాలని సూచించారు. ఏపీడీ చంద్రశేఖర్, ఏపీఓ లక్ష్మయ్య, ఏపీఎం బాలచందర్, సీసీలు, తదితరులు ఉన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి



తెలకపల్లి: సకాలంలో రుణాలు చెల్లించాలని శ్రీనిధి ఆర్‌ఎం రీజినల్ మేనేజర్ మహేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీశక్తి భవనంలో శ్రీనిధి రుణాలపై మహిళా సంఘాల సభ్యులకు సెర్ప్ అధికారులు అవగాహన కల్పించారు. 2024–25 సంవత్సరానికి రూ.4.60 కోట్ల లక్ష్యానికి ఇప్పటివరకు రూ.90 లక్షలు రుణాలు ఇచ్చామన్నారు. మంగళవారం రూ. 20 లక్షలు రుణాలు అందించినట్లు పేర్కొన్నారు. శ్రీనిధిలో నూటికి రూ.92 పైసలు వడ్డి పడుతుందని వాయిదాలు 60 నెలలో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీడీపీఎం పైనాన్స్ శ్రీనిధి మేనేజర్ వెంకటేష్, నాగరాజు, ఏపీఎం నిరంజన్, అనీల్, సీసీ నిరంజన్, వీఓఏ అరుంధతి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

బల్మూర్: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బాణాల గ్రామానికి చెందిన నిమ్మల విష్ణుకు ఈనెల 25న బిల్లకల్ గ్రామానికి చెందిన దుండుగుల మల్లేష్ ఫోన్ చేసి తీవ్ర అసభ్య పదజాలంతో కులం పేరుతో దూషించినట్లు తెలిపారు. దీనిపై అదే రోజు ఫోన్ రికార్డుతో సహ బల్మూర్ ఎస్‌ఐకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించక పోగా తనను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పైగా తననే ఎస్‌ఐ బెదిరించాడని పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ బాల్‌రాజును వివరణ కోరగా కేసు నమోదు అనుమతి కోసం ఫిర్యాదును కోర్టుకు పంపినట్లు తెలిపాడు. ఫోన్లో కులం పేరుతో దూషించిన విషయంలో నేరుగా కేసు నమోదు చేసే అధికారం తమకు లేదని పేర్కొన్నాడు.

హత్యను నీరుగార్చేందుకు యత్నం

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసును పోలీసు యంత్రాంగం నీరుగార్చేందుకు యత్నిస్తుందని ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు గురై ఐదు రోజులు అవుతున్నా ఇప్పటివరకు నిందితులను పట్టుకోకపోవడమే ఇందుకు నిదర్శమన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కనుసన్నల్లో విచారణ సాగుతోందని విమర్శించారు. పారదర్శకంగా దర్యాప్తు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు విష్ణు, కురుమయ్య ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 1998–99 సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరికొకరు ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు గుర్తుచేసుకొని సంబురపడ్డారు. ఆటపాటలు ఆడుతూ సంతోషం వ్యక్తం చేశారు. పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం మోశన్న, ఉపాధ్యాయులు బక్కయ్య, కాశీం, దామోదర్‌రెడ్డి, రాములు, గోవర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ, పూర్వ విద్యార్థులు సత్యనారాయణ, చంద్రశేకర్, బాలరాజు, బాలకృష్ణ, బాబు, రమేష్, శ్రీదేవి, శారద, అలివేల, సరస్వతి, గాయిత్రి తదితరులు పాల్గొన్నారు.

దేశీయ నాటుకోళ్లు పంపిణీ

అచ్చంపేట రూరల్: మండలంలోని చౌటపల్లిలో మంగళవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో 18 మంది పేద చెంచు, గిరిజన కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 దేశీయ నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎండీ ఇస్మాయిల్ మాట్లాడుతూ సంస్థ నుంచి చెంచులకు పెరటి తోటల పెంపకం, సేంద్రియ సాగుకు ప్రోత్సాహకం, ఉచితంగా కూరగాయల విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగస్వామి, మహేష్, గురువయ్య, వీరస్వామి, లింగమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.